క్లుప్తంగా

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించండి



కరపత్రాలు అందిస్తున్న వెంకటరమణరెడ్డి

పాలసముద్రం : మండల పరిధిలోని పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి ఓటు వేసి మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిశీలకుడు వెంకటరమణరెడ్డి కోరారు. బుధవారం మండల పరిధిలోని ఆముదాల, పాలసముద్రం, వెంగళరాజుకుప్పం, బాలకృష్ణాపురం, తిరుమలరాజుపురం గ్రామాల్లో పర్యటించి పట్టభద్రులను కలిశారు. శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

కోడి పందేలు నిషేధం

పుత్తూరు రూరల్: సంక్రాంతి వేడుకల్లో కోడి పందేలు, జూదం, జల్లికట్టును ప్రభుత్వం నిషేధించినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నిబంధలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత కార్యక్రమాలు ఎక్కడ జరుగుతున్నా ప్రజలు పోలీసులకు తక్షణం సమాచారం అందించాలని కోరారు. ప్రజలందరూ సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా ఇళ్లలోనే జరుపుకోవాలని సూచించారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం



మాట్లాడుతున్న విజయకుమార్

పాలసముద్రం : మండలంలో ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ విజయకుమార్ తెలిపారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బాబు ఆధ్వర్యంలో బీఎల్‌ఓలకు సమావేశం నిర్వహించారు. విజయకుమార్ మాట్లాడుతూ ఆధార్ అనుసంధానానికి ఓటర్ల నుంచి ఫారం 6బీ స్వీకరించాలని, వాటిని గరుడ యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఓటరు జాబితాలో తప్పొప్పులను సరిచేయాలని సూచించారు.

సన్మానం



గంగాధరనెల్లూరు: శ్రీసీతారాముల భజన బృందాన్ని బుధవారం జీడీనెల్లూరుకు చెందిన విశ్రాంత విద్యుత్ ఉద్యోగి షణ్ముగంపిళ్లై ఘనంగా సన్మానించారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి జీడీనెల్లూరు దిగవూరు భజన మందిరంలో రోజూ వేకువజామున చలిని సైతం లెక్క చేయకుండా భజనలు చేస్తున్నారు. శ్రీసీతారాముల్ని అత్యంత భక్తి శ్రద్ధలతో కీర్తిస్తూ గ్రామ సంకీర్తన చేస్తున్నారు.

19న చేపల చెరువుల వేలం

గంగాధరనెల్లూరు: జీడీనెల్లూరు పంచాయతీ ఇరగమరెడ్డికండ్రిగ గ్రామంలోని ఈఆర్‌కండిగ చెరువు, ఈఆర్‌కండిగ జంగమ చెరువుల్లో చేపల పెంపకం కోసం ఈనెల 19వ తేదీ వేలం వేయనున్నట్లు ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. అలాగే కోటాగరం పంచాయతీలోని అల్లికుంట, సర్కార్‌పెద్దచెరువు, బసివిరెడ్డికుంట, బసివిరెడ్డి ఒడ్డు, మరపురెడ్డికుంట, అంకిరెడ్డిఒడ్డు, బాలిరెడ్డిపెద్దచెరువు సర్వేనంబర్ 5, బాలిరెడ్డి పెద్దచెరువు సర్వేనంబర్ 54, మంచినీళ్లకుంట, చిన్నకొండయ్యకోట చెరువుల్లో చేపల పెంపకం కోసం ఈనెల 18వ తేదీ వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పుత్తూరు రూరల్: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని, సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, సూపర్‌వైజర్ పోస్టుల్లో వయోపరిమితి ఉప సంహరించాలని కోరారు. ఈ మేరకు ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

పలువురికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో మంగళవారం మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 41 మందికి రూ. 27,400 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు 41 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

నేడు శ్రీత్యాగరాజ ఆరాధన

తిరుపతి కల్చరల్: ఎస్వీ సంగీత, నృత్య సంగీత కళాశాలలో గురువారం శ్రీత్యాగరాజస్వామి వారి 176వ ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. వాగ్గేయకార వైభవం కార్యక్రమంలో భాగంగా టీటీడీ ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ మేరకు కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. త్యాగరాజస్వామి దివ్యనామ సంకీర్తనలను తిరువయ్యార్ పద్ధతిలో బృందగానం చేయనున్నారు

రావమ్మ..సంక్రాంతి లక్ష్మి



నగరి: విద్యార్థులకు బహుమతుల ప్రదానం



పుత్తూరు: గొల్లపల్లె హైస్కూల్‌లో భోగి సందడి

నగరి : నగరి దక్షిణం ప్రాథమిక పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. గురువారం నుంచి పాఠశాలలకు సెలవు ఉండడంతో ముందస్తుగా పాఠశాలలో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో ముస్తాబై రావడం పండగ వాతావరణాన్ని తలపించింది. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి తల్లిదండ్రులు పాఠశాల ఆవరణను ముగ్గులతో అలంకరించారు. మావిడాకులతో ముస్తాబు చేశారు. ఉపాధ్యాయులు భోగిమంటలు వేసి పండుగ విశిష్టతను తెలియజేశారు. భోగిమంటల చుట్టూ విద్యార్థులు, ఉపాధ్యాయులు కోలాటాలు ఆడడం ఆకర్షించింది. పొంగళ్లు పెట్టి, చెరకు గెడలతో అలంకరించి సంక్రాంతి లక్ష్మికి ముందస్తు స్వాగతం పలికారు. విద్యార్థులకు ముగ్గులు, ఉట్టి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం కుప్పరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలం గొల్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను కోలాహలంగా జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తులతో విచ్చేసి విద్యార్థినులు అలరించారు. రంగవల్లులు తీర్చిదిద్దారు. గొబ్బి తట్టారు. భోగి మంట వేశారు. కలశ పూజతో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం భారతి మాట్లాడుతూ తెలుగువారికి ముఖ్యమైన పండుగ సంక్రాంతి అని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

వెదురుకుప్పం మండలంలో..

వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేట సోక్రటీస్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు స్థానిక ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ బహుమతులు అందజేశారు. భోగి మంట వేసి సందడి చేశారు. కరెస్పాండెంట్ గుణశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్వేటినగరం మండలంలో..

కార్వేటినగరం: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహా విద్యాసంస్థలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు కోలాహలంగా జరుపుకున్నారు. భోగిమంట వేశారు. గొబ్బిళ్ల, కోలాటాలతో సందడి చేశారు. రంగవల్లులు తీర్చిదిద్దారు. ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా..

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ జెడ్పీ హైస్కూల్, శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయం, అరుణోదయ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో బుధవారం సంప్రయబద్ధంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. రంగువల్లులు తీర్చిదిద్దారు. గొబ్బిళ్లు తట్టారు. పొంగళ్లు పెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో సింగిల్‌విండో అధ్యక్షురాలు గాలి జ్యోతి, హెచ్‌ఎం మనోహర్‌నాయుడు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



నగరి : పొంగళ్లు పెట్టి సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



పాలసముద్రం : సచివాలయ ఆవరణలో ..



పాలసముద్రం : బలిజకండ్రిగ హైస్కూల్‌లో..



గొబ్బి తడుతున్న విద్యార్థినులు



వెదురుకుప్పం : భోగి సందడి



కార్వేటినగరం : పొంగలి పెడుతున్న విద్యార్థినులు

కొబ్బరిలో తెల్లదోమను నివారించాలి



పసుపు తోట పరిశీలిస్తున్న అధికారుల బృందం

పుత్తూరు రూరల్: కొబ్బరి చెట్లను ఆశించి పంట దిగుబడిని గణనీయంగా నష్టపరిచే తెల్లదోమ నివారణా చర్యలను రైతులు చేపట్టాలని తిరుపతి జిల్లా వ్యవసాయ శాఖ, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య సూచించారు. బుధవారం పుత్తూరు మండలం తిమ్మరాజుకండ్రిగ గ్రామంలో రైతులకు పంటల సస్యరక్షణపై శిక్షణ ఇచ్చారు. తెల్లదోమ నివారణకు ఎలాంటి పురుగు మందులు పనిచేయవని, కేవలం వేపమందు (10,000 పీపీఎం) 2 మిల్లీలీటర్లను లీటరు నీటితో కలిపి పిచికారీ చేయడం ద్వారా అదుపు చేయవచ్చని తెలిపారు. అనంతరం అధికారుల బృందం గ్రామంలోని మామిడి, సంపెంగ, పసుపు తోటలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. మామిడిలో పూత సమయంలో చీడపీడల నివారణా చర్యలను వివరించారు. సంపెంగ తోటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ రైతు సుధాకర్‌వర్మ, జిల్లా వనరుల కేంద్రం ఏఓలు వేణుగోపాలరావు, సుధ పాల్గొన్నారు.

సమష్టి కృషితో మండల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ హేమలతారెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం) : అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని ఎంపీపీ హేమలతా రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వ సభ్యసమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు తెలిపిన సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించి మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు, ఎక్సైజ్ అధికారులు సమావేశాలకు హాజరు కావడం లేదని, వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీవో శివయ్య మాట్లాడుతూ పెనుమూరు అంబేడ్కర్ కాలనీ లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించి, త్వరితగతిన బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దొరస్వామి, వైస్ ఎంపీపీలు కోదండ, దూది అరుణ, సింగిల్ విండో అధ్యక్షుడు కారేటి గోవిందరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు యశోద, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పుత్తూరు: పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న చైర్మన్ హరి

పుత్తూరు రూరల్: పుత్తూరు వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా వితరణతో ప్రతి బుధవారం పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రులకు పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు పౌష్టికాహార పంపిణీ క్రమం తప్పకుండా జరుగుతోంది. గర్భిణులకు, వారి సహాయకులకు విజిలబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్లు, కర్రీ, పచ్చడి, సాంబారు, రసం, పెరుగన్నం, చిక్కీ, అరటిపండు అందించారు. వైద్యాధికారి శంకర్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్స్ నారాయణస్వామి, నాయకులు జయబాబు తదితరులు పాల్గొన్నారు.

633 మందికి జగనన్న తోడు

వడమాలపేట : మండలంలో జగనన్న తోడు పథకం కింద 6వ విడత 633 మంది చిరు వ్యాపారులకు లబ్ధి చేకూరింది. చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలకు రూ.10 వేలను వడ్డీలేని రుణాలుగా 6 విడత ప్రభుత్వం పంపిణీ చేసింది. మండలంలో 633 మంది చిరువ్యాపారులకు రూ. 1,58,764 లబ్ధి అందడంతో ఆయా కుటుంబాల్లో సంక్రాంతి పండగ ముందే వచ్చింది.

సబ్సిడీ నువ్వుల విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

నింద్ర: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు 80శాతం సబ్సిడీపై నువ్వుల విత్తనాలు పంపిణీ చేశారు. బుధవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఎంపీపీ దీప చేతుల మీదుగా విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రైతులు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ శుభ, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, సర్పంచ్ బాబురెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య పాల్గొన్నారు.

పశుగ్రాస విత్తనాల పంపిణీ

నింద్ర: మండలంలోని అత్తూరులో పాడిరైతులకు బుధవారం తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేశారు. మంచి పోషకాలు కలిగిన కెఎఫ్ఎస్ 31 రకాన్ని పంపిణీ చేసి, సాగు మెలకువలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, దివ్య, రామ్‌కుమార్, అనూష, తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి కాలనీ ఇళ్లు సిద్ధం కావాలి

- అవసరమైన వారికి మెప్మా ద్వారా రుణాలు
- మౌలిక వసతుల కల్పనకు ఏర్పాట్లు చేయాలి
- జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్



పనులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

నగరి: రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలలో భాగంగా గృహ నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఉగాది నాటికి నగరి మండలంలోని నాగరాజ కుప్పం లేఅవుట్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన నగరి అర్బన్‌లోని లబ్ధిదారుల కోసం నాగరాజకుప్పం మార్గంలో నిర్మిస్తున్న 1200 గృహాల లే అవుట్‌లో పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో వేగంతో చేయాలన్నారు. పనులు జరుగుతున్న తీరుపై లబ్ధిదారులను ప్రశ్నించారు. మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఏ వసతి లేకున్నా వెంటనే ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు. అవసరమైన వారికి మెప్మా ద్వారా రుణాలు అందించాలన్నారు.

సమస్యలను గుర్తించాలి

పౌర సేవలతో పాటు సమస్యలను గుర్తించి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం సాయంత్రం నగరి కశింమిట్ట వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బందితో ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. ఆర్డీవో సుజన, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, హౌసింగ్ డీఈ శంకరప్ప, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ భాస్కర్, మెప్మా అధికారి సునీత, సచివాలయ అడ్మిన్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్‌ల పరిశీలన

కార్వేటినగరం: మండల పరిధిలోని డీఎంపురం, పాదిరికుప్పం గ్రామాల్లో పక్కాగృహాల నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించి స్థలాలను జేసీ వెంకటేశ్వర్ పరిశీలించారు. రోడ్డు, తాగునీటి పైప్‌లైన్లు వేశారని, లే అవుట్ ఊరు చివర ఉందని, మిట్ట పల్లాలుగా ఉందని, ఇళ్ల నిర్మాణాలు సాధ్యం కాదని లబ్ధిదారులు తెలిపారు. తమకు మరో ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. జేసీ మాట్లాడుతూ గ్రామ సభలో తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపితే పరిశీలిస్తామని పేర్కొన్నారు. అలాగే పాదిరికుప్పంలో లబ్ధిదారులకు కేటాయించి స్థలాలను పరిశీలించారు. లబ్ధిదారులు 40 మంది ఉన్నారని, వారు తమ గ్రామ సమీపంలోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతున్నట్లు అధికారులు జేసీకి చెప్పారు. తగిన నిర్ణయం తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.

పుష్కరిణి పనులు వేగవంతం చేయండి



సూచనలిస్తున్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణం శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ పుష్కరిణి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని దేవస్థానం చైర్మన్ కె.రమేష్‌బాబును పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ఆదేశించారు. బుధవారం కోనేరు ప్రాంగణంలో నూతనంగా చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గదుల నిర్మాణం పూర్తయితే ఎంతో కాలంగా ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటున్న వారికి మేలు జరిగినట్లేనని తెలిపారు. పుష్కరిణి పనులను పూర్తి చేసి మహాశివరాత్రికి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ వీఎం.మాహీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మణమూర్తి, ఉదయ్, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

సుమన్ కుటుంబానికి పరామర్శ

పుత్తూరు రూరల్: పట్టణానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ సుమన్ కుటుంబాన్ని పర్యాటక శాఖ మంత్రి రోజా పరామర్శించారు. సుమన్ తండ్రి సుబ్రమణ్యం ఇటీవల మృతి చెందారు. బుధవారం సుమన్ ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహీన్, కౌన్సిలర్ చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

శవ రాజకీయాలు చేయొద్దు



సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, కౌన్సిలర్లు

- పెన్షన్ల గురించి మాట్లాడే అర్హత 'గాలి'కి లేదు
- గుండెపోటు మృతిని రాజకీయం చేయడం నీచం
- భానుప్రకాష్ ఆరోపణలపై వైఎస్సార్ సీపీ నేతల ఆగ్రహం



పింఛన్ మంజూరైనట్లు చూపుతున్న ఆన్‌లైన్ స్టేటస్

నగరి: తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ బాధ్యుడు గాలి భాను ప్రకాష్ ఎలాంటి ప్రజాసేవ చేయక పోగా ఉనికి కోసం శవరాజకీయాలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, పలువురు కౌన్సిలర్లు తీవ్రంగా మండిపడ్డారు. మున్సిపల్ పరిధి ఏకాంబర కుప్పంలో వృద్ధుడు రామస్వామి (88) గుండెపోటుతో మృతి చెందడాన్ని పెన్షన్ ఆపేయడంతో మరణించాడని తప్పుగా చిత్రించి భాను ప్రకాష్ చేసిన వ్యాఖ్యలపై వారు మండిపడ్డారు. బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వాస్తవాలు తెలుసుకోకుండా శవ రాజకీయాలు చేయడం భానుప్రకాష్ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. రామస్వామికి పెన్షన్ తొలగించలేదని వేలిముద్రలు, ఐరిష్ పడని కారణంగా ఇతర ఆధారాలు అధికారులు అడిగారని తెలిపారు. ఇంతలో అతను మృతిచెందడానికి పెన్షన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. రామస్వామి ఐడీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే అతనికి పెన్షన్ వస్తుందో ఆగిందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవచ్చన్నారు. వాస్తవానికి ఆయనకు నాలుగు ఇళ్లు ఉన్నాయని, ఆయన సంతానం ఇన్‌కమ్ టాక్స్ అసెసీలని, అయినా ఆయన నిరాధరణకు లోనయ్యారని పెన్షన్ మంజూరు చేసిన ప్రభుత్వం తమదని తెలిపారు. ఇదివరలోనే గుండెపోటుకు గురై చికిత్స పొందుతున్న రామస్వామి మృతిని ప్రభుత్వ హత్యగా భాను ప్రకాష్ అభివర్ణించడం నీచరాజకీయానికి పరాకాష్ట అన్నారు. బతికున్నవారు ఎవరూ ఆయనకు సహకరించడం లేదని, శవాలతో రాజకీయం చేస్తున్నరన్నారని ఎద్దేవా చేశారు. ఆయనకు పెన్షన్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

పార్టీలకతీతంగా పింఛన్లు

టీడీపీ అధికారంలో ఉండగా 3,150 పెన్షన్లు మాత్రమే ఇచ్చేవారని, జన్మభూమి కమిటీ వెరిఫికేషన్ అంటూ కేవీపీఆర్‌పేటలో కెడీ వెంకటాచలం అనే టీడీపీ నాయకుడు 90 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారి పెన్షన్లు తొలగించారని, వాటిని మళ్లీ పునరుద్ధరించలేదని నీలమేఘం పేర్కొన్నారు. టీడీపీ నాయకుడు కేడీ వెంకటాచలానికి కూడా తమ ప్రభుత్వం పెన్షన్ ఇస్తోందని తెలిపారు. నగరి మున్సిపాలిటీలో పార్టీలకతీతంగా 7,581 మందికి పెన్షన్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు కోవిడ్ కష్టాల్లో ఉంటే ఆదుకోవడానికి రాని భాను ప్రకాష్ ప్రస్తుతం ఎవరు చనిపోయినా ఆగమేఘాలపై వచ్చి రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని పెన్షన్లు ఇచ్చారో? గత ప్రభుత్వం ఎంత అభివృద్ధి చేసింది, మంత్రి రోజా ఎంత అభివృద్ధి చేశారో తేల్చుకుందామని, అందుకు సిద్ధమా అంటూ నీలమేఘం సవాలు విసిరారు. లైట్లు వెలగలేదని చెప్పే ఆయనకు మున్సిపాలిటీలో ఎన్ని వీధులున్నాయో తెలుసా అని ప్రశ్నించారు. మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు గంగాధరం, బీడీ భాస్కర్, భూపాలన్, గంగాధరం, మోహన్‌రాజ్, బాబు, మురుగ, దయానిధి, గోపాల్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, ఇంద్రయ్య, బిలాల్, సాయిసంధ్యారాణి, అమర్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, కోఆప్షన్ సభ్యులు ఆనంద్, ఎల్లప్పరెడ్డి, నాయకులు కన్నాయిరం, గోపాల్‌రెడ్డి, పురుషోత్తం, శ్రీనివాసులు, అయ్యప్ప పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఉద్యానవన అధికారి మధుసూదన్‌రెడ్డి

వెదురుకుప్పం: సరైన సస్యరక్షణ చర్యలతో మామిడి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాస్త్రవేత్త రామయ్య తెలిపారు. బుధవారం వెదురుకుప్పంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పూత దశలో ఉద్యాన వన శాఖ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలన్నారు. జిల్లా ఉద్యాన వన అధికారి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పూత ఆశించిన స్థాయిలో రావాలంటే పొటాషియం నైట్రేట్ 10 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పూత, కాయ, మంగు, తేనె, మంగు పురుగు నివారణకు మోనోక్రోటోపాస్ 1.5 మిల్లీ లీటర్లు, ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీలీటర్లు, థ్రోమేక్షన్ 0.3 మిల్లీలీటర్ల మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, వ్యవసాయాధికారి వనిత, అధికారులు కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి



హోమ పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని కన్య మూల గణపతి సన్నిధిలో బుధవారం సంకటహర చతుర్థిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత వినాయకస్వామికి విశేష అభిషేక పూజలు,అలంకరణలు చేశారు. హోమపూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత సోనీ స్ట్రైకర్స్



తిరుపతి కల్చరల్: తిరుపతి తిరుమల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ స్నేహ పూర్వక క్రికెట్ టోర్నమెంట్ పోటీలో సోనీ స్ట్రైకర్స్ జట్టు విజేతగా నిలిచింది. వెటర్నరీ యూనివర్సిటీ గ్రౌండ్‌లో బుధవారం స్నేహ పూర్వక క్రికెట్ టోర్నమెంట్‌లో చంద్రగిరి, తిరుమల, తిరుపతి, రేణిగుంటకు చెందిన సుమారు 6 ఫొటోగ్రాఫర్స్ జట్లు పాల్గొన్నాయి. ఇందులో విజేతగా నిలిచిన జట్టుకు ఈస్ట్ ఎస్ఐ నాగేంద్రబాబు చేతుల మీదుగా కప్‌తో పాటు రూ.10 వేలు నగదు బహుమతిని అందజేశారు. కెనాస్ వారియర్స్ జట్టుకు కప్‌తో పాటు రూ.5 వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రాజ్, అమర్‌నాథ్, రాజేష్, సునీల్, శరత్, సతీష్, హరి, బాలాజి, ఆనంద్ తోపాటు ఫొటో, వీడియోగ్రాఫర్‌లు, అనుబంధ వృత్తిదారులు పాల్గొన్నారు.